క్లుప్తంగా

మైనింగ్ అనుమతులు నిలిపివేయాలంటూ నిరసన


నిరసన చేస్తున్న లక్డారం యువకులు, రైతులు

పటాన్‌చెరు టౌన్: కెఎస్‌ఆర్ మైనింగ్ అనుమతులు నిలిపివేయాలని గురువారం లక్డారం యువకులు, రైతులు, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలోని పెద్ద చెరువు పక్కనే కెఎస్‌ఆర్‌కు ఇచ్చిన మైనింగ్ అనుమతులను నిలిపివేయాలన్నారు. ఈ విషయంపై పటాన్‌చెరు తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కావలి వీరేశం, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, రవీందర్ గౌడ్, నరసింహులు గౌడ్, గణేష్, రవి గౌడ్, శీను పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బందిగా మారిన రహదారి


ఇరుకుగా మారిన రహదారి

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు శాస్త్రీనగర్‌లో రహదారి ఇరుకుగా మారింది. రెండునెలల క్రితం మురుగు కాల్వను నిర్మించి వాటికి పైకప్పుగా బెడ్లు వేశారు. దీంతో రహదారి సగానికి తగ్గింది. మురుగు కాల్వ కొద్దిదూరానికి ఇళ్లు ఆనుకుని ఉన్నాయి. రహదారి మధ్యలోంచి దాదాపు 50 కుటుంబాల వారు మోటారుసైకిళ్లపై, కాలినడకన వెళ్ళలేని దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బెడ్లకు సమానంగా సీసీ రహదారిని నిర్మించాలని వారు కోరుతున్నారు.

పాండురంగ ఆలయ వార్షికోత్సవం


సంగప్పను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

నారాయణఖేడ్: ఖేడ్ మండలం హుమ్రాన(జి)లో పాండురంగ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అంతర్‌గామ రుక్మిణి, పాండురంగ ఆలయ పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతి మహరాజ్ కీర్తనలు అలరించాయి. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, మారుతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ బాధ్యులు వారిని శాలువాకప్పి సన్మానించారు.

కంప్యూటర్ విద్య తప్పనిసరి


సర్టిఫికెట్లను పంపిణీచేస్తున్న డాక్టర్ శివబాబు

జహీరాబాద్ టౌన్: నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలని శ్రామిక్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ శివబాబు అన్నారు. శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 5వ బ్యాచ్‌కు కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి గురువారం సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సందర్భంగా శివబాబు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో రాణించాలంటే కంప్యూటర్ నాలెడ్జ్ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక విజ్ఞాన కేంద్రం కోశాధికారి మహిపాల్, సభ్యులు శ్రీనివాస్, శిక్షకులు ప్రతాప్ కుమార్‌లు పాల్గొన్నారు.

వైభవంగా గురు దత్తాత్రేయ వార్షికోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

సదాశివపేట(సంగారెడ్డి): మాణిక్ ప్రభు మందిరంలో గురువారం శ్రీ గురు దత్తాత్రేయ తృతీయ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సద్గురు బబన్‌రాజ్, మహరాజ్ చయనరాజు ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, కళశాల ఊరేగింపు, గీతాపారాయణం, అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ, భజన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీమాణిక్ ప్రభు, ఆలయ కమిటీ, భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


జిన్నారం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే


పటాన్‌చెరు: భూమిపూజలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మహనీయుల జీవితాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న రెండు శివాజీ విగ్రహాల భూమి పూజకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో మహాత్మా గాంధీ, అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఉపసర్పంచ్ శోభ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయింపు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని, సీఎస్‌ఆర్ నిధులతో కూడా అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారంలోని శివానగర్‌లో రూ.35లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నిధులతో పాటు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఉపయోగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ రేఖ, ఎంపీటీసీ సభ్యురాలు సంతోష, వెంకటేశంగౌడ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల మందులు వేయించాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


నట్టల మందు వేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: గొర్రెలు, మేకల కాపర్లు తప్పనిసరిగా జీవాలకు నట్టల మందులు వేయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్‌పూర్‌లోని సుల్తాన్‌పూర్ గురువారం గొర్రెలకు నట్టాల మందు పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతి సంవత్సరం మూడు సార్లు ఉచితంగా నట్టల మందు పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ మందు వేయడంతో జీవాలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, నాయకులు రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక స్థానం

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): తెలంగాణలో గ్రామ దేవతలకు ప్రత్యేక స్థానం ఉందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండల పరిధిలోని గట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠకు గురువారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతలను ప్రతిష్ఠించుకోవడం ఆనవాయితీ అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామ దేవతలు ఆదరణను కోల్పోయాయని, రాష్ట్ర ఏర్పాటు అనంతరం తిరిగి పూర్వవైభవం సంతరించుకున్నాయన్నారు. జాగృతి రాష్ట్ర కార్యదర్శి బిక్షపతి, రైతుబంధు మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి శివాజీరావు, ఏఎంసీ డైరెక్టర్ మధు, ఎంపిటీసీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంతోనే సమస్యల పరిష్కారం


ముదిరాజ్ భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: సంఘటితంగా ఉంటేనే సమస్యల్ని పరిష్కరించుకోగలుగుతామని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు అన్నారు. నమ్లిమేట్ గ్రామంలో గురువారం ముదిరాజ్ భవన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రోషన్‌రెడ్డి, సర్పంచ్ విఠమ్మ, ఎంపీటీసీ శేరి శ్రీనివాస్, సత్యపాల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు విఠల్ ముదిరాజ్, శివకుమార్ ముదిరాజ్, తుకారాం ముదిరాజ్, భూమయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం (పటాన్ చెరు): బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జీహెచ్‌ఎంసీ, రాంకీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన నిర్వహించారు. అతిథిగా భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇంట్లోని చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు.. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పాల్గొన్నారు.

మంచినీటి నిల్వకు ట్యాంకు ఏర్పాటు


నిర్మించిన ట్యాంకు వద్ద విద్యార్థులు

నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని కేశవ్ స్మారక ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు సంబంధించి స్ట్రీట్ కాస్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులు ఖేడ్ మండలం మాద్వార్ తండాలో మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలక్రితం తండాలో పర్యటించి అక్కడి సమస్యలను వారు తెలుసుకున్నారన్నారు. తండాలో నీటిసరఫరాకు ట్యాంకు లేదనే విషయాన్ని గుర్తించి సుమారు రూ.60వేల వరకు తమ డబ్బులతో రెండు మినీట్యాంకులను నిర్మింపజేశారని చెప్పారు. గురువారం తండాకు వచ్చిన విద్యార్థులు స్ట్రీట్ కాస్ అధ్యక్షుడు రాజబాలాజీ చేత ప్రారంభింపచేశారు. ఈ కార్యక్రమంలో రాజునాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జహీరాబాద్ టౌన్: రెండో విడుత కంటి వెలుగు శిబిరాన్ని ఎన్‌జీవో కాలనీలోని 5వ వార్డు, అర్జున్‌నాయక్ తండాలో ప్రారంభించారు. ఐదో వార్డులో నేత్ర వైద్యులు డాక్టర్ స్పందన, ఎం.మంజుల, ఆశా వర్కర్లు లక్ష్మి, పద్మలు కంటి పరీక్షలు నిర్వహించారు. గురువారం 302 మందికి పరీక్షలు చేయగా, 33 మందికి అద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి మందులు ఇచ్చారు. .

న్యాల్‌కల్(జహీరాబాద్): మల్గి గ్రామంలో గురువారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ మారుతి యాదవ్ ప్రారంభించారు. అనంతరం వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు కేటాయించండి

జోగిపేట(అందోల్): అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని జోగిపేట 17వ వార్డు కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు అధికారులను కోరారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక సమయంలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని అధికారులను ఆయన కోరినట్టు చెప్పారు. లబ్ధిదారుల జాబితాను అధికారులు పునఃపరిశీలన చేసి అర్హులైన వారిని గుర్తించి ఇళ్లను మంజూరు చేయాలన్నారు.

సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి


యంత్రాన్ని అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ అంబికా సోని రైతులకు సూచించారు. గురువారం అనంతసాగర్‌లో ఆదర్శ రైతు మాజీ ఎంపీటీసీ ప్రకాశంకు వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసుపు రైతులకు బాయిలింగ్, పాలిసింగ్ నిమిత్తం 75 శాతంతో యంత్రాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ శివకుమార్, ఏఈఓ మనోహర్, ఎండి అయాజ్ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన


పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను కాంట్రాక్టర్ ఆరుబయట కూర్చోబెట్టారనే విషయం వెలుగులోకి రావటంతో గురువారం కాంగ్రెస్ నాయకులు పాఠశాలను సందర్శించారు. జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేశ్, ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌గౌడ్, సర్పంచులు నీలమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగ్‌రావు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. అనంతరం రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న మూల మలుపు వద్ద కేబుల్ వేసేందుకు తవ్వకాలు జరుపడంతో మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమైందని చెప్పారు. గురువారం పైపులకు మరమ్మతులు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన వివరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మాణిక్‌రెడ్డిని గెలిపించాలి


మాణిక్‌రెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు కోరారు. గురువారం సంగారెడ్డిలోని వివిధ కళాశాలలు, పాఠశాలలను సందర్శించి మాణిక్ రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం టీఎస్ యూటీఎఫ్ అని, నిజాయితీగా నిబద్ధతతో పనిచేస్తున్న మాణిక్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాస్ రావు, సంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సింహాచలం, జ్యోతి, కమలాకర్ రావు, సూర్య నారాయణ శర్మ, షకీల్ అహ్మద్, రాజేందర్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న గార్డెన్‌దొర ట్రస్ట్ సభ్యులు

జహీరాబాద్: మెథడిస్ట్ సెంట్రల్ చర్చి ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం జహీరాబాద్‌లో జిబి గార్డెన్‌దొర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో దీన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు రక్త పరీక్షలు, కంటి, దంత వైద్యం, ఈసీజీ, షుగర్ పరీక్షలు చేశారు. రోగులకు ఉచింతగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ట్రస్ట్ అధ్యక్షుడు దేవదానం, సభ్యులు జోసెఫ్, దేవదర్శన్, సామెల్, వినయ్‌కుమార్, రతన్‌రాజ్, సంపత్, మోజెస్, ఇజ్రాయిల్, సుదర్‌రాజు, రాజారావు, డాక్టర్లు జవహర్ కెనడి, రవితేజ, ఎస్తేర్, దివ్య, లక్ష్మి, శ్రీదేవి, ప్రిసిలా, ఎంఆర్‌హెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న వెంకటేశం

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీఓ వెంకటేశం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కూలీల ప్రయోజనాల కోసం, వలసల నివారణకు చేపట్టిన ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకంలో కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయికోడ్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పనులను, కూలీల వివరాలతో పాటు హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు తుక్కప్ప, పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): బసంత్‌పూర్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. ఉదయం గ్రామానికి వెళ్లిన ఆయన పొలాల గట్ల వద్ద తీస్తున్న కందకాల పనులను పరిశీలించారు. ఎంత మంది కూలీలు వచ్చారు? ఏయే పనులు చేస్తున్నారు? రోజూ ఎంత మంది పనులకు వస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ అబ్బాస్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో ఆటో డ్రైవర్ కృష్ణ ప్రమాదవశాత్తు గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.13వేలు ఆర్థిక సాయం అందించారు. కార్మికులకు తను ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆశ్రమం నుంచి చేవెళ్లకు పాదయాత్ర**



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని పసల్వాది గ్రామ శివారులో గల జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆశ్రమం నుంచి చేవెళ్లలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు గురువారం పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్ర 26వరకు సాగుతుందన్నారు.

◆ **తొమ్మిది మందికి కోవిడ్ టెస్టులు**

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం తొమ్మిది మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 6 మందికి నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

◆ **దరఖాస్తు చేసుకోవాలి**

మునిపల్లి(అందోల్): మోడల్ స్కూల్లో 6నుంచి 10వ తరగతి సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. మార్చి1 వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

◆ **సన్మానం**

నర్సాపూర్: మండల ఉపసర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎస్‌ఐ శివకుమార్‌ను గురువారం సన్మానించారు. మండల ఉపసర్పంచ్‌ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఉప సర్పంచ్‌లు కడారి నాగరాజు, గణేశ్, వినోద, ధన్సింగ్, కిషన్, మల్లేశ్, పూల్‌సింగ్ తదితరులు ఎస్‌ఐని కలిసి సన్మానించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజా ప్రతినిధులు తమకు సహకరించాలని కోరారు.

◆ **ఆర్థికసాయం**

శివ్వంపేట(నర్సాపూర్): పేద కుటుంబాలకు జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా గురువారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన మల్లయ్య కూతురు వివాహానికి, అలాగే చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన జాతీయ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ కూతురు వివాహానికి రూ. 5 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, బీఆర్‌ఎస్ నాయకులు పాపయ్యచారి, అంజాగౌడ్, నజీర్ ఉన్నారు.

రాచన్న స్వామి జాతరకు సర్వం సిద్ధం


భక్తులకు అన్నదానం చేస్తున్న కౌలాస్ కుటుంబసభ్యులు (ఫైల్)

- కౌలాస్ వారిదే తొలిపూజ
- వేలాది మందికి అన్నదానం

కోహీర్(జహీరాబాద్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బడంపేట శ్రీ రాచన్న స్వామి జాతర నేటి నుంచి నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వాస్తవ్యులు 'కౌలాస్ పరివారం' బడంపేట శ్రీ రాచన్న స్వామి జాతరలో నిరంతరం అన్నదానం నిర్వహిస్తూ తరిస్తున్నారు. సుమారు 100 సంవత్సరాల నుంచి నిరంతరాయంగా అన్నదానం చేస్తూ వస్తున్నారంటే వారి అకుంఠిత దీక్ష, దేవునిపై వారికున్న విశ్వాసాన్ని అర్థం చేసుకోవచ్చు.

కౌలాస్ కులదైవం

వీరభద్ర స్వరూపుడైన బడంపేట శ్రీ రాచన్న స్వామిని కౌలాస్ పరివారం వారి కులదైవంగా భావిస్తారు. జాతర ఉత్సవాల ప్రారంభం, ముగింపు ఉత్సవాల్లో కౌలాస్ కుటుంబం ప్రధాన పాత్ర నిర్వహిస్తారు. స్వామి వారి రుద్రాభిషేకం, అశ్వవాహన సేవ, రథోత్సవం కౌలాస్ వారితోనే ప్రారంభిస్తారు.

మూడు రోజులు అన్నదానం

అత్యంత ప్రాచీన కాలం నుంచి నిర్వహించబడుతున్న శ్రీ రాచన్న స్వామి జాతరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలతో పాటు పక్కనే ఉన్న కర్ణాటక నుంచి భక్తులు తరలి వస్తుంటారు. రవాణా సౌకర్యాలులేని కాలంలో జాతరకు ఎడ్లబండ్లపై వచ్చేవారు. ఆలయ పరిసరప్రాంతాలలో వారు విడిది చేసేవారు. వంట చేసుకోవడానికి కౌలాస్ కుటుంబం అన్నదాన సత్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న కౌలాస్ కుటుంబం సభ్యులు సుమారు 150 మంది జాతరకు ఇక్కడే మకాం వేస్తారు. వారిసేవా తత్పరతకు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలాస్ కుటుంబంలో జన్మించడం అదృష్టం



వీరభద్ర స్వరూపులై భద్రకాళి సమేత శ్రీ రాచన్న స్వామి మా కుల దైవం. స్వామివారి కృపా కటాక్షం మాపైన ఉండడం వల్లే మేమందరం మంచిగానే స్థిరపడ్డాం. మా వంశాచారం ప్రకారం వందల ఏళ్లుగా స్వామి వారి ఉత్సవాలను ప్రారంభించే అవకాశం లభించడం సౌభాగ్యంగా భావిస్తున్నాం. నిరంతర అన్నదానం నిర్వహించడం సంతృప్తినిస్తుంది.

– మహాదేవ్, కౌలాస్ కుటుంబసభ్యులు